# నమ్మకస్తుడు

ఏవండీ! ఎక్కడైనా దొరికిందా!" అంది కాంతమ్మ, అప్పుడే వచ్చి మంచం వాల్చుకుని కూచున్న భర్త రాజయ్యను చూసి.

రాజయ్య పెళ్లాం మాట విన్నా విననట్టుగా, మంచం మీద నడుంవాల్చి దీర్ఘంగా నిట్టూర్చాడు.

భర్తవాలకం భార్యకు వుడుకెత్తించింది.

"మిమ్మల్నే? ఏమైంది? మాట్టాడరేం?"

పెళ్ళాం వాడిచూపుల్ని ఎదుర్కొనే శక్తి రాజయ్య కళ్ళల్లోంచి ఎప్పుడో పోయింది. తన కళ్ళల్లోకి గుచ్చి చూస్తోన్న భార్య చూపుల్ని తప్పుకొని రాజయ్య ఇంటి కప్పుకేసి చూడసాగాడు.

"నా మాటే చెవులో దూరడంలేదే? నీగ్గాదూ చెప్పేదీ? ఇంట్లో కానీ లేదనీ! వారంరోజుల్నుంచీ నెత్తీ నోరూ బాదుకొని చెప్తూన్నా మనిషికి చీమ కుట్టినట్టయినా లేకపోతేను!" కాంతమ్మ సంభాషణ బహువచనంలోంచి ఏకవచనంలోకి దిగింది.

"ఏమిటే నీ గొడవా?" అన్నాడు రాజయ్య మంచం మీదనుంచి లేచి కూర్చుని.

"అల్లుడుకూడా రేపే వస్తాడట! అదిగో వుత్తరం రాశాడు. తెల్లారే పండగ. ఇంట్లో వొక్కటి లేదు. అప్పో సప్పో ఎక్కడన్నా తీసుకురాకపోతే నేనేంచేసేది?" అన్నది కాంతమ్మ.

“రామారావు వస్తానని రాశాడా?” నిరుత్సాహంగా అడిగాడు రాజయ్య; “ఏదీ వుత్తరం!”

భార్య వడమటింట్లోకిపోయి, కూతురు చదువుతూన్న వుత్తరాన్ని తీసుకొచ్చి భర్తకిచ్చింది.

రాజయ్య అల్లుడు రామారావు రాసిన వుత్తరం చదువుకొన్నాడు. అయినా అందులో రాజయ్యకు వుత్సాహం కలిగించే దేముంది ? పెళ్ళాం చెప్పగా చెవులారా విన్న సంగతినే కళ్ళతో చదివి దృఢంచేసుకొన్నాడు.

గతవారంలో వస్తానో రానోనని అనుమానంగా రాసిన అల్లుడు వస్తాననే రాశాడు. రాజయ్యమనసు బరువెక్కింది. ఇంట్లో వొక్కవస్తువు లేదు. చేతిలో ఎర్రని ఏగానీ లేదు.

తెల్లవారితే పండగ !

హీనపక్షం పదిరూపాయలన్నా కావాలి ! ఇంట్లో ముగ్గురు చిన్నపిల్లలూ, పెళ్ళయిన కూతురూ, ఓ ముసలమ్మా, తనూ, తన భార్యా వున్నారు. ఎంత లేదన్నా పది రూపాయలైనా లేకపోతే పండగ్గడవదు. పెద్దవాళ్ళ మాటెలా వున్నా ఆడుకొనే వయసులో వున్న పిల్లలు వుసూరుమని పోతారు. రెండు రూపాయలన్నా పెట్టి మతాబాలూ, పువ్వొత్తులు అవీ యివీ తెస్తే పిల్లలు సంతోషంగా కాల్చుకొంటారు.

రాజయ్య రెండు రోజుల్నుంచీ కాలికి బలపం కట్టుకు తిరిగినా పదిరూపాయలు అప్పు పుట్టించలేక పోయాడు.

వందలా, వేలా, పది అంటే పది! పండగఖర్చు. అప్పు దొరకలేదంటే రాజయ్యకు తల కొట్టేసినట్టుగా వుంది.

రాజయ్య శేషయ్యను అప్పు అడగటానికి పోయి వుత్తచేతుల్తో అప్పుడే తిరిగి యింటికి వచ్చాడు.

శేషయ్యమీద ఎంతో ఆశపెట్టుకు వెళ్ళాడు. కాని శేషయ్యకూడా లేదనేసరికి రాజయ్య మనసు చివుక్కుమంది.

—తను ఎన్నిసార్లు శేషయ్యకు ఐదూ పదీ సర్దలేదు? తనకివ్వాల్సి వచ్చేసరికి లేదంటాడా ?

—సరే; శేషయ్య అంతంత మాత్రం వాడేగనక అతనిదగ్గరా లేవనుకో? కాని అంతవున్న సాంబయ్యకేం రోగం? గంటకు ముందయితే ఇచ్చేవాడట! అంతకుముందే ఎవడో వచ్చి అడిగితే ఇచ్చాడట! పైగా ఆ తప్పుడుమాట లెందుకు, ఇవ్వనివాడు ఇవ్వనని చెప్పకా! సాంబయ్య మనిషిని నమ్మడు. పదిరూపాయలిస్తే ఎగేసిపోతానా ఏం? ఊరికే అడిగానా? అప్పేగా? సాంబయ్య మొగమోటం చెడకుండా డబ్బు పోకుండా వుండాలనేరకం.

—పోనీ భద్రయ్యనుఅడిగితే? ఛీ! మళ్ళీ ఏముఖంతో అడగటం? సంవత్సరంపాటు తీసుకొన్న ఏభై రూపాయలూ ఇంతవరకూ ఇవ్వలేదు. ఇప్పుడు మళ్ళీ అడిగితే ఏమనుకుంటాడు ?

—ఆలోచించినకొద్దీ రాజయ్యకు తనమీద తనకే అసహ్యం కలిగింది. తన పరపతీ, విలువమీద అపనమ్మకం ఏర్పడింది.

"అల్లుడు కూడా వస్తున్నాడుగదా? నేనేం చేసేది?" దిగులుగా అంది కాంతమ్మ, మొగుడు మంచంపక్కన చతికిలపడి కూర్చుంటూ.

పెళ్ళాం అన్న వాక్యంలో 'అల్లుడూ' అన్న శబ్దం రాజయ్య మెదడుకుతాకి అతని ఆలోచనకు అంతరాయాన్ని కలిగించింది.

"వస్తే రానియ్!" అర్థరహితంగా అన్నాడు రాజయ్య. ఏమిటో అన్నాడు అంతే!

మొగుడు తెలివితక్కువగా అన్నమాటను 'ధీమా'గా తీసుకొని అంది కొంచెం ఉత్సాహంగా—

"అయితే! ఎక్కడన్నా దొరికిందా ఏమిటీ? ఎంతేవిటీ?"

"ఏవిటి దొరికింది?" వెలవెలపోతూ అన్నాడు రాజయ్య.

"నా అస్తులు!" అని చివాలున లేచి రంయిన లోపలికి వెళ్ళిపోయింది కాంతమ్మ.

రాజయ్యకు గుండెలు కుదించివేసినట్టయింది.

"నాన్నోయ్! నాకు దొరికింది!" అంటూ ఏడేళ్ళ చిన్నకొడుకు రాజయ్యదగ్గరకు బాణంలా పరుగెత్తుకొచ్చాడు వీధిలోంచి.

ఇంట్లోకి పోతున్న తల్లీ, మంచంలో కూచున్న తండ్రీ కుర్రాడివైపు వింతగానూ ఆశ్చర్యంగానూ చూశారు.

వాడు జేబులోంచి వత్తి కాలిపోయిన వొకతాటాకు టపాకాయ బయటికి తీశాడు.

తండ్రి కొడుకు చేతుల్లోంచి టపాకాయ తీసుకొని తనిఖీచేసి అన్నాడు—

"ఒరే! వెధవా! ఇది మోగదురా?"

"ఊ! ఊఁ. మోగుతుందిలే!" అన్నాడు కొడుకు.

"వత్తిలేదురా దీనికి-మోగదు."

"అయితే మోగేయి తెచ్చిపెట్టు!" మారాంచేశాడు కొడుకు.

రాజయ్య చిక్కున పడ్డాడు.

"మోగుతుందిలేరా!" అన్నాడు.

"ఊ! వట్టిదే! మోగదు" అల్లరిచేశాడు కొడుకు.

"నాన్నోయ్! చూడు! పువ్వొత్తులు, విష్ణుచక్రాలూ, మతాబాలూ! చూడు చూడు! ఎన్నో? కమలకే వాళ్ళ నాన్న తెచ్చాడంట నాన్నో!"—రాజయ్య చిన్నకూతురు, స్నేహితురాలు కమలను వెంటబెట్టుకొని ఇంట్లోకి వచ్చింది.

కమల చంకలోవున్న బుట్టలోకి ఆశగా చూస్తోంది—"నాన్నో, నాక్కూడా తెచ్చిపెట్టవ్?" అని చిన్నకూతురు తండ్రిని అడిగింది కళ్ళల్లోకి చూస్తూ.

కూతురు అమాయకపు చూపులూ, కళ్ళల్లోని వెలుగూ, గొంతులో స్పందించిన ఆశా తండ్రి హృదయాన్ని కదిలించివేసినై.

"తెస్తాలే అమ్మా!" అంటూ రాజయ్య భుజాన పంచ వేసుకొని బయటికి బయలుదేరాడు.

"అమ్మోయ్! బుల్లెమ్మగారి అల్లుడొచ్చినట్టున్నాడే! వాళ్ళింటిముందు బండాగింది!" పక్కింటిముందు బండాగటం

చూసి రాజయ్య పెద్దకూతురు తల్లితో అంది. మొగుడు కోసం ఎదురుచూపులు చూస్తోన్నదానికి పక్కింటి స్నేహితురాలి మొగుడు తన మొగుడికంటే ముందు రావడం నిరుత్సాహజనకమైంది.

పెద్దకూతురు గొంతులో ధ్వనించిన అర్థం బయటకు బయటకు పోతోన్న రాజయ్యకు అర్థమైంది, రేప్పొద్దుటికి 'ఈయనా వస్తాడ్లే!' అని మనసులో అనుకొన్నాడు రాజయ్య.

అల్లుడొచ్చాడంటే గుడ్డలూ అవీ పెట్టాలిగా? అందులోనూ ఇది మొదటిపండగేగా! ఆ ఆలోచన రాగానే 'చచ్చాంరా దేవుడా' అనుకొన్నాడు రాజయ్య.

అతగాడొచ్చాడంటే పిండివంటలూ అవీ ఆర్భాటంగా చేయాలి కామాలి? గుడ్డలూ అవీ ఎంతలేదన్నా వభై రూపాయల్దాకా కావాల్సొస్తుంది!

"ఎవడిస్తాడూ?" రాజయ్య శూన్యంలోకి ప్రశ్నించాడు.

"అప్పేగా?" రాజయ్య మనసు రాజీగా అంది.

"అప్పే? అయితేమాత్రం ఎవడిస్తాడు?" రాజయ్య అంతరాత్మ ఎదురుతిరిగింది.

"ప్రయత్నించూ!" అంది రాజయ్య మనసు.

రాజయ్య వీధివాకిలి దిగుతూండగా యానాది కోటిగాడు ఎదురొచ్చాడు.

"దణ్ణాలు దొరగారో? దణ్ణం!" అన్నాడు కోటి

గాడు రాజయ్యకు పక్కకు తొలిగి నుంచొని ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

కోటిగాడు మాంచి దిట్టమైన మనిషి. నల్లగా దృఢంగా వుంటాడు. వాడి చూపులూ, కోరమీసం— అప్పుడప్పుడూ వచ్చి రాజయ్యకు ఆపనీ యీపనీ చేసిపెట్టి పోతూంటాడు.

"ఏరా కోటిగా, ఇటొచ్చావ్?" అడిగాడు రాజయ్య.

"ఏవుంది, దొరా? పండగ్గదూ! దొరగార్ని నో రూపాయి డబ్బులు అడుక్కుందామని వొచ్చాను!" అన్నాడు కోటిగాడు.

"ఏడిశావ్! డబ్బులేడున్నయిరా?" అన్నాడు రాజయ్య.

"అట్టా అనబాకండి దొరోయ్! మీమీద పెద్దాశ పెట్టుకొచ్చానూ! మీరియ్యకపోతే పండగపూట పిల్లలు పత్తుంటారు దొరోయ్!" అన్నాడు దీనంగా కోటాయ్.

"అయితే వుండ్రా కోటాయి! రామయ్యగారింటికి పోయొస్తాను!"

"సావుకా ర్రామయ్యగారింటికేనా దొరా?"

"ఆఁ. అక్కడికేరా! ఏవన్నా పైకం సర్దుతాడేమో అడిగొస్తా!" అని రాజయ్య బయలుదేరాడు.

"పదండి దొరా! నేనుకూడా వత్తాను!" కోటిగాడు రాజయ్య వెనకే బయలుదేరాడు.

రామయ్యగారింటిదగ్గిరకు రాగానే కోటిగాడు వీధి అరుగుల వక్కన నుంచొన్నాడు; రాజయ్య లోపలకెళ్లాడు.

మధ్యహాల్లో ఎవరూ లేకపోయేసరికి రాజయ్య వుత్తరంపక్కన వున్న గదిలోకి తొంగిచూశాడు. రామయ్య నోట్లకట్టలు లెక్కపెట్టుకుంటూ యినప్పెట్టెముందు కూర్చుని వున్నాడు. అది చూసి రాజయ్య గుట్టుచప్పుడుగా వెనక్కు తిరిగొచ్చి హాల్లో కూర్చొన్నాడు.

కొంచెం సేపటికి రామయ్య యినప్పెట్టెలో డబ్బు పెట్టుకొని తాళంవేసి వొకసారి లాగి చూసుకొని హాల్లోకి వచ్చాడు.

వస్తూనే అన్నాడు — "ఏమోయ్! రాజయ్యా? ఎంతసేపయింది వచ్చి?"

"అబ్బే! యిప్పుడే వచ్చాను!"

"ఏమిటి సంగతి!"

"ఆఁ. ఏమీలేదు. ఏభైరూపాయలుంటే సర్దుతావని" నసిగాడు రాజయ్య.

"ఆరె! నీ యిల్లు బంగారంగానూ? ఇప్పుడా అడిగేది? మొన్ననే కాష్ అంతా బ్యాంకీలో కట్టేశానుగా?" అన్నాడు రామయ్య బొంగురు గొంతుతో.

"ఓ పాతికయినా—" అప్పటికే సగంచచ్చి అడిగాడు రాజయ్య—

"పండగ ఎల్లమారిపోతుంది. మా అల్లుడు కూడా వస్తాడు. ఓ నెల్లో ఇస్తాను."

"రామ! రామ! నాదగ్గిర కానీ వుంటే ఎంత్తొట్టు పెట్టే అంతొట్టు! మాట చెప్పితే నమ్మరుగందా, రాజయ్యా! నేనే పండక్కార్చుకు నో పది చేబదులు మీాబోటివాళ్ళ నడుగుదామనుకుంటుంటేనూ—" రామయ్యమాట పూర్తి గాకముందే రాజయ్య లేచి నుంచొన్నాడు.

రాజయ్యకు వళ్ళు మండిపోయింది. రామయ్య వెనక వడి అంటొన్నది వినిపించుకోకుండానే రాజయ్య విసురుగా బయటికొచ్చాడు.

బయట నుంచొన్న కోటిగాడ్ని చూడకుండానే తల వంచుకొని నడిచిపోతూన్నాడు రాజయ్య. కళ్ళు చింతనిప్పుల్లా మండిపోతూన్నాయి. కడుపులో మంట. హృదయంలో ఆవేశం రగులుకుపోతోంది.

కోటిగాడు రాజయ్యను పిల్లిలా అనుసరించాడు.

రాజయ్య ఊరిబయట వంతెనదగ్గరకు పోయి ఆగాడు. వంతెన గోడమీాద కూర్చొని కోటిగాడివంక మౌనంగా చూశాడు.

"ఆ రామయ్య పిల్లికి బిచ్చంపెట్టడుగందా; ఆయ నెట్టా యిత్తాడని అడిగారండీ దొరా!" అన్నాడు కోడిగాడు రాజయ్య పక్కన చేరి.

"అసలాడి నడగడం నాదే తప్పురా? నోట్లకట్టలు పెట్టెలో పెట్టుకొని దమ్మిడీ లేదని వొట్లేసుకుంటాడ్రా. వొట్లు!"—కసిగా అన్నాడు రాజయ్య.

"అసలట్టాంటి నాయాళ్ళనీ —" పళ్లు కొరికాడు కోటిగాడు.

"ఓరేయ్, కోటిగా! మాట!" నిశితంగా చూస్తూ రాజయ్య అన్నాడు.

కోటిగాడు ముందుకు జరిగి రాజయ్య చెప్పింది శ్రద్ధగా విన్నాడు

★ ★ ★

తెల్లవారింది.

దీపావళి లోకానికి ఆనందం, ఉత్సాహం ఆశా జ్యోతులున్న మోసుకువచ్చింది.

చీకటి పడుతోంది—

రాజయ్యగారి యింటిముందు చీకటిని చిందరవందర చేస్తూ ఆకాశంలో బాణాసంచా పేలింది. ఇంటిముందు బారులు బారులుగా వందలకొద్దీ దీపాలు వెలుగుతోన్నాయి.

రాజయ్య పెళ్ళాం కాంతమ్మ ఆనందపరవశురాలై ప్రమిదల్లో నూనెపోసి వత్తులు పైకి తోస్తోవుంది.

రాజయ్య పెద్దకూతురు కొత్త పట్టుచీర కట్టుకొని, చిరచిర లాడించుకొంటూ అటూ ఇటూ తిరుగుతూ భర్త వంక కొంటెగా చూస్తోంది.

అల్లుడు కొత్త సిల్కు-పంచలు కట్టుకొని సీమ టపా కాయలు కాల్చి భార్య వెనక చిలిపిగా వేసి, ఆ మోతకు పెళ్లాం అదిరిపడినప్పుడల్లా ఆనందిస్తోన్నాడు.

రాజయ్యగారి పిల్లలిద్దరూ ప్రపంచాన్నే మరిచిపోయి మతాబాలూ, పువ్వొత్తులూ కాల్చుకొంటున్నారు.

రాజయ్య వరండాలో కుర్చీలో కూర్చొని తాపీగా చుట్ట కాల్చుకొంటున్నాడు. పిల్లలూ, భార్యా, అల్లుడూ ముఖాల్లో, కళ్ళల్లో ద్యోతక మౌతూన్న సంతోషాన్ని, ఆనందాన్ని వివిధరంగులు వెదజల్లుతున్న మతాబుల కాంతిలో చూస్తూ రాజయ్య తన్మయత్వం పొందుతున్నాడు.

బయట దీపాల్లో నూనె పోస్తోన్న కాంతమ్మకు పావుకారు రామయ్యగారి జీతగాడు ఒక వార్త చెవున వేశాడు.

వెంటనే కాంతమ్మ లోపలకు పరుగెత్తుకొచ్చి భర్తతో ఆశ్చర్యపోతూ అంది.

"ఏమండోయ్! విన్నారా? కోటిగాడ్ని పోలీసులు పట్టుకుపోయారంటగా?"

"ఆఁ." అన్నాడు రాజయ్య.

రాజయ్యకు వెన్నెముకలో తుపాకిగుండు దూరినట్టయింది. గుండెలు చిక్కపట్టినట్టయింది.

"ఓరి వీడి శిరసు వగల! రాత్రి రామయ్యగారింట్లో దొంగతనంచేసింది వీడేనంట!" బుగ్గ నొక్కుంది కాంతమ్మ.

"అట్లాగా?" అన్నాడు రాజయ్య సాలోచనగా.

"దొంగముండాకొడుకు? ఇంతకాలం మనం నమ్మి ఇంటికి రానిచ్చాం? ఏదైనా యింతేగదా? ఎంత గుండెలు తీసినపని?" ముక్కుమీంద వేలేసుకొంది రాజయ్య పెళ్లాం.

"నాన్నోయ్! ఆయన చిచ్చుబుడ్డి వెలిగిస్తోన్నారు చూడు!" అంది రాజయ్య పెద్దకూతురు.

అల్లుడు చిచ్చుబుడ్డి వెలిగించాడు. అగ్నిజ్వాలలు వెదజల్లుతూ చిచ్చుబుడ్డి ఆకాశంలోకి లేచింది.

రాజయ్య ఎదలో చిచ్చురేగింది. ఎంత వెలుతురూ రాజయ్య హృదయంలోని చీకటిని తరుమలేకపోయింది.

పెళ్ళాం బిడ్డలూ, అల్లుడూ దీపావళీ సంబరంలో మునిగిపోయారు. రాజయ్య మెల్లిగా లేచి వంటింట్లోకి వెళ్లాడు. వుట్టిలో పెట్టివున్న బుట్టలోంచి అరిశలూ, గారెలూ తీసి పైపంచలో మూటకట్టుకొని, మధ్యయింట్లో బల్లమీద వున్న నాలుగుమతాబులు, టపాకాయలు జేబులో వేసుకొని దొడ్డిదోవన బయటపడ్డాడు.

ఊళ్ళోగుండా అడ్డంపడి పొలాల్లోకి పోయాడు. కాలవ పక్కనవున్న గూడెందాటి ఒక ఫర్లాంగుదూరంలో గూడానికి పెడగా వో దిబ్బమీదవున్న గుడిశదగ్గరకు పోయి తడిక తోశాడు.

కోటిగాడి పెళ్ళాం తడికతోసుకొని బయటికొచ్చింది.

"ఎవరా మడిసీ ?"

"నేనే! రాజయ్యను ! పద !" అని గుడిశెలోకి వంగి నడిచాడు.

"అదేంది దొరగారూ! యిట్లా వచ్చారు ఇప్పుడూ ? ఆడ్ని జైల్లోకి నూక్కుపోయింద్రు ! పండగపూట ! అయ్యో దేవుడా ?" నెత్తిన చేతులు బాదుకొని కోటిగాడి పెళ్ళాం పెద్ద పెట్టున ఏడ్చింది.

"ఊరుకోవే, రామీ! తొందరగానే వస్తాడ్లే ఊరుకో! ఇవిగో చూడు ! బుడ్డాడ్ని లేపు !" భుజాన వున్న మూట దించుతో అన్నాడు రాజయ్య.

చుట్టు గుడెశలోపల కోటిగాడి కొడుకు ఆసక్తితో ఎర్ర మతాబా కాల్చుకొంటున్నాడు.

కోటిగాడి పెళ్లాం కొడుకును చూసుకొంటూ, రాజయ్య తెచ్చిన అరిశలు ఆప్యాయంగా తింటూంది.

రాజయ్య గుడిశలో నోమూల కూర్చుని కోటిగాడి పెళ్ళాన్నీ, కొడుకునూ చూస్తో అనుకొన్నాడు—

"కోటిగాడు నమ్మకస్తుడు: ఇంతవరకూ చెప్పలేదు. ఇహ చెప్పడుకూడా. పోలీసుల చేతుల్లో పడితే ఏం? కోటిగాడు చెప్పడు. చెప్పడులే! నమ్మకస్తుడంటే వాడే!"

ఎర్రనికాంతి గుడెశలో అలుముకుంది.

రాజయ్య కళ్ళు చెమ్మగిల్లాయి.